అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
బుధవారం 15 మార్చి 2023

గురుకులాల ప్రవేశ దరఖాస్తుకు రేపే ఆఖరు

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 16 చివరి తేదీ అని ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు, ఏప్రిల్ 23న కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డు జనరేట్ చేసుకోండి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కాలోజీవాడి గ్రామంలో ఆరోగ్యశ్రీ మిత్రాల ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకంలో పేరు నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ మిత్రులు మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకంలో విధిగా పేరు నమోదు చేసుకొని రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చని అన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఎక్కడైనా ఉచిత వైద్యం పొందవచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు దగ్గర్లోని ఆరోగ్యశ్రీ సిబ్బందిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగవ్వ నర్సయ్య, ఉపసర్పంచ్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, ఆశావర్కర్ శ్రీలత, ఆరోగ్యశ్రీ మిత్రులు లక్ష్మారెడ్డి, మహేష్, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పరీక్షలకు వేళాయె..

- నేటి నుంచి ఇంటర్ ఎగ్జామ్స్
- 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 48,765 మంది విద్యార్థులు..

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇంటర్ పరీక్షలకు రంగం సిద్ధమయ్యింది. మార్చి 15(నేటి) నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేసే విషయంలో యాజమాన్యాలు ఫీజుల పేరిట ఇబ్బందులు పెట్టకుండా ఆన్‌లైన్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం తెలంగాణ ఇంటర్ బోర్డు కల్పించింది. వేసవి దృష్ట్యా తాగునీరు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచినట్టు తెలిసింది. పరీక్షల నిర్వహణపై ఇప్పటికే జిల్లా చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్ మెంట్ అధికారులతో జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ సమావేశం ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 15వ తేదీ(నేటి) నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, 16వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 35,017 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరనున్నారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 17,503, సెకండ్ ఇయర్ విద్యార్థులు 17,514 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల తరువాత విద్యార్థులను కేంద్రాలకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్క పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను కచ్చితంగా సీసీ కెమెరాలు ముందు సీల్ తీయాలని జిల్లా ఇంటర్ అధికారి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎండాకాలం ఉన్నందున ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీటి వ్యవస్థ ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పరీక్ష ప్రశ్నాపత్రాల ఇప్పటికే సంబంధిత పోలీస్ స్టేషన్లకు కస్టోడియను ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఇక విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా కౌన్సిలింగ్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఇక కామారెడ్డిలోనూ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 38 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 7,495 ఫస్ట్ ఇయర్ విద్యార్థులు, 6,253 సెకండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

నేడు మంత్రి కేటీఆర్ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మంత్రి కేటిఆర్ బుధవారం మండల కేంద్రానికి వస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ళ దుర్గారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో రూ.కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన పంచాయితీ రాజ్ అతిథి గృహం, రూ.25 కోట్లతో నిర్మించిన పెద్ద పుల్ వంతెన ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రు. 476 కోట్లతో నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులను శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ధఫెదర్ రాజు,వైస్ ఎంపిపి మనోహర్, రమేష్ గౌడ్, గైని విఠల్, నర్సింహరెడ్డి, బాబుసెట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై అవగాహన

నవతెలంగాణ-బోధన్

నెహ్రూ యువ కేంద్రం నిజామాబాద్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై, లైఫ్ స్కిల్స్‌పై, చట్టాలపై, ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులపై అవగాహన, విద్యార్థులు సమాజంలో రాణించడానికి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుతం హెచ్-3ఎన్-2 అనే ఫ్లూ వ్యాప్తి చెందడంతో దాని నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ రోహిత్ సింగ్ విద్యార్థులకు వివరించారు. జీవితంలో సంభవించే సమస్యలు వాటి పరిష్కారానికి వినయ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగరత్నం, లీగల్ అసిస్టెంట్ పద్మాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నవతెలంగాణ-బోధన్



వేసవి నేపథ్యంలో నేటి నుంచి బడులు ఒంటి పూటనే నడవనున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మార్చి 15 బుధవారం నుంచి ప్రభుత్వ ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు స్కూళ్లను ఒకటే పూట నడిపించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 24 వరకు అమల్లో ఉండనుంది. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 12:30ల వరకు పనిచేయాలని, అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12:30 గంటలకు అందించాలని పేర్కొన్నారు. ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం 1.00 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

బోరుకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి

జువ్వాడి గ్రామస్తుల రాస్తారోకో


రాస్తారోకో చేపట్టిన గ్రామస్తులు, నాయకులు

నవతెలంగాణ-గాంధారి

నీటి ఎద్దడి తీర్చేందుకు బోరు తవ్వకం చేపడితే దానికి కరెంట్ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నరని జువ్వాడి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల తీరుకు నిరసనగా మంగళవారం గాంధారి-బాన్సువాడ రహదారిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు స్పందించి తక్షణమే బోరుబావికి విద్యుత్ సౌకర్యం కల్పించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న ఏఈ సతీశ్‌రెడ్డి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. కరెంట్ కనెక్షన్ ఇస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విమరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు బద్దం విజయ్, సంగయ్య, వెంకట్ రెడ్డి, వడ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, వినయ్, గుర్రం మోహన్, శ్యామ్, గుర్రం సంతోష్, శ్రీనివాస్, వడ్ల లక్ష్మీపతి, గ్రామస్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గంగోత్రికి న్యాయం జరిగే వరకూ పోరాడుతాం : ఐద్వా


బాధితురాలితో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

నవతెలంగాణ-వర్ని

మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన గంగోత్రి నరేష్ గత తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రేమించుకున్నారు. ఇప్పుడు ప్రియుడు తల్లిదండ్రుల మాటలు విని గంగోత్రిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని ప్రియుడు ఇంటి ముందట ఆందోళన చేపట్టిన విషయం విధితమే. కాగా బాధితురాలికి ఐద్వా నాయకులు బాసటగా నిలిచారు. మంగళవారం ఆమెను కలిసి మాట్లాడారు. గంగోత్రికి న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేపడతామని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, సబ్బని లత తెలిపారు. ఆడపిల్లల జీవితాలతో ఆడుకొని మోసం చేసే వ్యక్తులను వదిలిపెట్టేది లేదని వారు హెచ్చరించారు. అవసరమైతే ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు చేపడుతామని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు కార్పోరేట్ విద్య

- మన ఊరు మన బడితో స్కూళ్లకు అదనపు హంగులు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని


రిబ్బన్‌కట్ చేస్తున్న స్పీకర్ పోచారం

గిరిజనులకు కార్పోరేట్ స్థాయి విద్య అందజేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మన ఊరు మన బడితో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లను అన్ని హంగులతో తీర్చిదిద్దినట్టు తెలిపారు. చందూర్ మండలం లక్ష్మాపూర్, మేడిపల్లి తండా జీపీల్లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన మేడిపల్లి తండాలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల మన ఊరు- మనబడి కార్యక్రమంలో ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. గిరిజన విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో విద్యను పొందేలా అన్ని హంగులతో పాఠశాల నిర్మాణం చేసినట్టు తెలిపారు. ఇలాంటి పాఠశాలలను కొనసాగించడం ద్వారా పేద విద్యార్థులు రాబోయే దినాలలో మంచి విద్యను చదివి ఉన్నతమైన స్థానంలో ఉంటారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు మనబడి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ రవి తమ్ముడి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. లక్ష్మాపూర్ గ్రామంలో ఎస్‌డిఎఫ్ ఎస్ఆర్ ఈజీఎఫ్ నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణానికి స్పీకర్ సర్పంచ్ సత్యనారాయణ అధ్యక్షతన భూమి పూజ చేసి ప్రారంభించారు.

జాకోరాలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పరిశీలన

వర్ని మండలంలోని జాకోర గ్రామంలో కొనసాగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. వర్షాకాలం పంటలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందేలా త్వరగా పరులను పూర్తిచేయాలని ఇంజనీర్లకు ఆదేశించారు. ఇప్పటివరకు పైప్ లైన్ పనులు పూర్తి అయినట్లు తెలిపినారు. గ్రామ అభివృద్ధికి చెందిన నిధులను మంజూరు చేసినారు. జనరల్ ఫంక్షన్ హాల్, రైతు వేదిక, గ్రామపంచాయతీ ప్రహరీ నిర్మాణానికి 20 లక్షల నిధులు మంజూరు చేశారు. పంచాయతీ దుకాణ సముదాయాల నిర్మాణానికి 12 లక్షల రూపాయలు ప్రకటించారు. గ్రామాల అభివృద్ధికి ఎలాంటి అవసరమైన పనులను చేసుకుని ప్రజా ప్రతినిధులు గ్రామాలను అభివృద్ధికి తోడ్పడాలని, బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి గ్రామం కూడా ప్రగతి బాటలో నడవాలన్నదే తన సంకల్పముగా కెసిఆర్ కృషితో నిధులను తెచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపినారు. జాకోర గ్రామంలో పశు వైద్య బిల్డింగుకు మూడు లక్షల రూపాయలు నిధులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మూడు కవిత అంబర్ సింగ్, సర్పంచులు కర్లం సాయి రెడ్డి, సత్యనారాయణ, మేడిపల్లి రవి, కారాగం దేవి సింగ్, అరికెల సాయి రెడ్డి, ఘన్పూర్ సర్పంచ్ దాసరి గంగారం, చందూర్ పిఎసిఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, ఎంఈఓ శాంతకుమారి, ఎంపీడీవో నీలావతి, తాసిల్దార్ వసంత, ఎం పి ఓ తారాచంద్, వర్ని మండల జడ్పిటిసి హరిదాస్, సర్పంచ్ గోదావరి గణేష్, మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్, జలాల్పూర్ సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్, ఎంపీటీసీ సాయిలు, పలువులు సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని ట్యాంక్ ఎక్కిన యువకుడు

- డబుల్ బెడ్ రూం మంజూరు లిస్టులో పేరు రాలేదని మనస్తాపం
- పేరు చేర్చడంతో కిందకు దిగిన వైనం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


టవర్ ఎక్కిన యువకుడు..


మాట్లాడుతున్న యువకుడు

కామారెడ్డి జిల్లాలో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన కలకలం రేపింది. డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరులో తన పేరు రాలేదని మనస్తాపానికి గురై ట్యాంక్ ఎక్కాడు. ఈ ఘటన కామారెడ్డిలోని ఇల్చీపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో 720 డబుల్ బెడ్రూమ్స్ ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. వాటి పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. లక్కీ డ్రా పద్ధతిలో మంగలవారం లబ్దిదారులను ఎంపిక చేసే ప్రక్రియను చేపట్టారు. అయితే కామారెడ్డి పట్టణంలో 5047 మంది డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. 3450 మందిని అధికారులు అర్హులుగా గుర్తించారు. వీరందరికీ పది మందికి ఒకటి చొప్పున లక్కీ డ్రా తీసి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అలాట్ చేయడంతో.. ఇల్చీపూర్ కు చెందిన సంతోష్ అనే వ్యక్తి మనస్థాపంతో పెట్రోల్ పోసుకుని వాటర్ ట్యాంక్ ఎక్కాడు. డ్రాలో తన పేరు లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ వాటర్ ట్యాంక్ ఎక్కడంతో.. అడ్లూర్‌లో ఆందోళన నెలకొంది. గ్రామస్థులు, పోలీసులు సంతోష్ ను కిందకు దిగిరావాలని వేడుకుంటున్నారు. అయినా కిందకు దిగకపోవడంతో తాహసిల్దార్ డబుల్ బెడ్ రూమ్ జాబితాలో సదరు వ్యక్తిపేరు చేర్చడంతో కిందకు దిగాడు. ఇక ఈ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ విధానంపై.. లక్కీ డ్రాపై అర్హులైన పేదవారు పెదవి విరుస్తున్నారు. అర్హులైనవారికి కాకుండా.. అనర్హులైన వారికి పంపిణీ చేశారంటూ కామారెడ్డి పట్టణ వ్యాప్తంగా అర్హులైన లబ్దిదారులు లిస్ట్‌లో పేరు దక్కనివారి నిరసనలు మిన్నంటాయి.

ఇసుక లారీల అడ్డగింత

- అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పుల్కల్ గ్రామస్తుల ఆగ్రహం
- డీఎస్పీ కార్యాలయానికి లారీలు తరలింపు

నవతెలంగాణ-బిచ్కుంద


రోడ్డుపై అడ్డంగా కేజ్‌వీల్‌ను పెట్టి లారీల అడ్డగింత

మండలంలోని పుల్కల్ గ్రామ సమీపంలోగల మంజీరా పరివాహక ప్రాంతం నుంచి మంగళవారం ఉదయం అనుమతులు లేకుండా ఓవర్ లోడ్‌తో వెలుతున్న లారీలను పుల్కల్ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక కాంట్రాక్టర్లు టీఎస్ఎండీసీ అనుమతులు ఉన్నాయంటూ గత వారం రోజులుగా ఎలాంటి ఇసుక రవాణా పత్రాలు లేకుండా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారని తమ ప్రాంత వనరులను కొల్లగొడుతున్నారని ఆగ్రహం చెందిన గ్రామస్తులు మంగళవారం ఉదయం 10 లారీలను అడ్డుకొని బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్‌కు సమాచారం అందించారు. అధికారులు లారీలను బాన్సువాడలోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. గత వారం రోజులుగా ఇసుక రవాణా జరుగుతున్న విషయాన్ని అధికారులకు, పోలీసులకు సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై అధికారుల కనుసన్నల్లోనే అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు గానీ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక కాంట్రాక్టర్లు అనుమతుల పేర్లతో జీరో దందాకు తెరలేపారని ఇసుక రవాణా పేరుతో ఈ ప్రాంత వనరులను తరలించి ప్రభుత్వ ఖజానాకు కోట్లల్లో నష్టం చేకూరుస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో పట్టుకున్న లారీలను డివిజన్ స్థాయి అధికారులు నామమాత్రపు జరిమానాలు విధించి వదిలేస్తున్నారని ప్రజా ప్రతినిధుల అధికారుల అండదండలతో యదేచ్ఛగా ఇసుక రవాణా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులతో అనుమతులు లేకుండా లారీల ద్వారా తరలిస్తున్న ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇండ్ల హామీని నిలబెట్టుకోండి..

- లేదంటే ఆక్రమించిన స్థలాల్లో నిర్మాణం చేపడతాం
- రియల్టర్లను వదలి పేదలపై ప్రతాపమా?
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్


మాట్లాడుతున్న టీ సాగర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు చేసిన వాగ్దానం మేరకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇవ్వాలని లేకపోతే పోరాటాల ద్వారా ఆక్రమించుకున్న స్థలాల్లోనే ఇండ్ల నిర్మాణం చేపడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ హెచ్చరించారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్టర్లు ఆక్రమించుకుంటే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారిక యంత్రాంగం.. పేదల తమ తల దాచుకునేందుకు గుప్పెడు జాగ అడిగితే పూర్తి నిర్బంధం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని గుడిసెలు వేసుకున్న పేదలకు భరోసా కల్పించారు. నిజామాబాద్ జిల్లాలో ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ మంగళవారం సందర్శించారు.

వివరాలు మెయిన్‌లో..

కాళేశ్వరం రీ డిజైన్ రద్దు చేస్తాం

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మిస్తాం
- టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి
- పనులు పరిశీలించి భూ నిర్వాసితులతో మాట్లాడిన రేవంత్


పాదయాత్రలో రేవంత్‌రెడ్డి వెంట నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-మోపాల్

సీఎం కేసీఆర్ కేవలం ధనార్జన కోసం మంచిప్ప రీజర్వాయర్‌ను రీ డిజైన్ చేయిస్తున్నాడని, దీంతో ఆయకట్టు విస్తీర్ణం పెరగకున్నా ముంపు పెంచాడని, దీంతో ఊర్లకు ఊర్లే ముంపునకు గురవుతున్నాయని టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ముంపు బాధితుల గోడు ఇప్పటి వరకు వినలేదని, బాధితులను పరామర్శించలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాగానే రీ డిజైన్ పనులు నిలిపివేసి పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని తెలిపారు. హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర మంగళవారం నిజామాబాద్ జిల్లా మంచిప్ప మీదుగా డిచ్‌పల్లి వరకు సాగింది.

వివరాలు మెయిన్‌లో..

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి


మల్లేష్

తాను ప్రేమించిన అమ్మాయిని తనకు దూరం చేశారని మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టేకుల మల్లేష్ (25) గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ప్రేమించుకుంటున్నారు. రెండు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వారిని ఇరువర్గాల కుటుంబ సభ్యులు వెతికి పట్టుకుని గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడారు. ఇక ఆ బాలిక తనకు దక్కదని తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి తల్లి పద్మ, తండ్రి సాయిరెడ్డి, అన్న నరేష్ రెడ్డి ఉన్నారు. ఇంతవరకు తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తానని ఎస్ఐ తెలిపారు.

సెల్ టవర్ తొలగించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



రుద్రూర్ మండలకేంద్రంలో ఎయిర్టెల్ టవర్ తొలగించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాచర్ల భాస్కర్ రాజ్, కార్యనిర్వాహక అధ్యక్షులు రాపెల్లి గురుచరణ్, కార్యదర్శి మార రాజేందర్ గుప్తా, రాజశేఖర్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఫోర్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోగల నరేంద్ర హై స్కూల్‌లో ఆల్ ఫోర్స్ స్కూల్ ఎలాంటి అనుమతులు లేకుండా విద్యార్థులను అడ్మిషన్స్ చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని బహిరంగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ విద్యాశాఖ అధికారులు మౌనంగా ఉండడం వెనుక కారణాలు విద్యాశాఖ అధికారులు డిమాండ్ చేశారు. ఆల్‌ఫోర్స్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని, పెంచిన ఫీజులు తగ్గించే విధంగా చూడాలని అడ్మిషన్లు రద్దు చేయాలని సూచించారు. లేకుంటే ఉద్యమాలు తప్పవని అన్నారు.

నాళేశ్వర్‌లో20 లక్షలతో సీసీ రోడ్డు పనులు



రోడ్డుపనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ద్యాగ సరిన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అందులో భాగంగానే 20 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ శ్యామల, వార్డు సభ్యులు రాజేశ్వర్, కిషన్, గ్రామస్తులు గంగాధర్, మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో..

బాధితులకు సత్వర న్యాయం జరిపించాలి

- సకాలంలో చార్జ్ షీట్ దాఖలు చేయాలి
- విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతం పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతి పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు పకడ్బందీగా దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. సామాజిక బహిష్కరణలు విధిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా తగిన శిక్షపడేలా ధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న ఘటనలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని అన్నారు. ప్రతీ నెల గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చూడాలని హితవు పలికారు. పోలీస్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇటీవలి కాలంలోనే రెండు కేసుల్లో సమగ్ర సాక్ష్యాధారాలతో ఫైల్ చేసిన చార్జిషీట్ ఆధారంగా న్యాయస్థానం నిందితులకు శిక్షలు విధించిందని తెలిపారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, ఏ సీ పీలు కిరణ్ కుమార్, ప్రభాకర్, కిరణ్ ఆర్డీవోలు రవి, శ్రీనివాస్, డీ టీ డబ్ల్యు ఓ నాగూరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మానవ జాతి ఉన్నంత కాలం మార్క్సిజం అజేయం : బీఎల్‌పీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్నిరకాల దోపిడి పీడనల నుండి మానవ జాతి విముక్తికి మార్గం చూపిన మార్క్సిజం మానవ జాతి ఉన్నంత కాలం అజేయంగా ఉంటుందని బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఎల్‌పి జిల్లా కార్యాలయంలోకారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎల్‌పి జిల్లా కన్వీనర్ కె.మధు, బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్,నగర్ కన్వీనర్ హైమద్ హుస్సేన్, బహుజన లెఫ్ట్ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ శ్రీమాన్ లు పాల్గొన్నారు.

మానవాళి సమస్యలకు మార్క్సిజమే పరిష్కారం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రపంచ మానవాళి సమస్యల పరిష్కారానికి మార్క్సిజమే పరిష్కారమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా ఇన్చార్జి కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. విశ్వమానవ ప్రేమికుడు, కార్మిక వర్గ సిద్ధాంతకర్త, ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నగర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో విప్లవ నివాళి అర్పించారు. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద దుష్ఫలితాలకు పరిష్కారం మార్క్సిజమేనన్నారు. మార్క్సిజాన్ని ఆయా పరిస్థితులకు అన్వయించుకుంటూ ముందుకెళ్లాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు డి.రాజేశ్వర్, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఏ.రవీందర్, సహాయ కార్యదర్శి బీక్ సింగ్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు వి. గోదావరి, పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్.కే అషుర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు విటల్, కిషన్, మురళి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ దోషులను శిక్షించండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ /భీంగల్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ దోషులను కఠినంగా శిక్షించాలని టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతోనే పేపర్ లీక్ అయ్యిందని, దాన్ని కప్పిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో హాకింగ్ అని లీకులు ఇచ్చారని ఆరోపించారు. టీఎస్పీఎస్సీ కార్యదర్శి పీఏ ప్రవీణ్ పేపర్ లీక్ చేసే దుస్థితికి కేసీఆర్ ప్రభుత్వం దిగ జార్చిందని మండిపడ్డారు. దీని వెనుక టీఎస్పీఎస్సీ చైర్మెన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఈ ఘటన మీద సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేని పక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

భీంగల్: టీఎస్‌పీఎస్‌సీ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలో ప్రమేయం ఉన్న అధికారులను వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ మండల అధ్యక్షులు నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి ప్రిఫేర్ అవుతుంటే పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి విద్యావ్యవస్థపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మంగళవారం జక్రాన్ పల్లి వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. వారి వెంట సీనియర్ జర్నలిస్టు మల్లేష్ తదితరులు ఉన్నారు

కబ్జాభూములను ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి

- సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ భూములను కబ్జాలనుంచి తొలగించి ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని మాణిక్ బండార్, దాస్ నగర్ శివారు ప్రాంతంలో ఉన్న చెరువు కట్ట భూమిని, మత్తడి కెనాల్ భూమిని నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సుజాత సాంబశివరావు సుమారు రెండున్నర ఎకరాలు కబ్జా చేసుకున్నారన్నారు. అందులో పంటలు పండిస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రశాంత్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అధికారులతో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని వెలికి తీస్తామని హామీనిచ్చారన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కొద్ది మంది పలుకుబడి కలిగిన వ్యక్తులు అక్రమంగా కబ్జాలు చేసుకొని అనుభవిస్తుంటే ప్రభుత్వం వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరించటం వల్ల పేదలకు కనీసం నివాసం ఉండటానికి కూడా ఇండ్ల స్థలాలు దొరకటం లేదని అన్నారు. మానిక్ బండార్, దాస్‌నగర్ శివారు ప్రాంతంలో ఉన్న చెరువు బఫర్ జోన్‌లో ఉన్న భూమిని చెరువు అలుగు కెనాల్ ప్రాంతాన్ని పూడ్చివేసి స్వాధీనం చేసుకున్న డాక్టర్ సుజాత సాంబశివరావు పై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక ప్రజలతో పోరాటం చేయాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొండ గంగాధర్, దాస్ నగర్ గ్రామ కార్యదర్శి ఎల్లయ్య గ్రామప్రజలు వెంకట్రావు, అశోక్, నాగేష్, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విగ్రహ ఏర్పాటుకు రూ.50వేలు విరాళం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో నెలకొల్పే ఛత్రపతి శివాజీ గణేషన్ విగ్రహ ఏర్పాటుకు ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి తన వంతుగా 50వేల రూపాయల నగదు విరాళం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కన్నె రాజేందర్, చిన్ని రమేష్ రెడ్డి, రోహిత్ రెడ్డి, పూదర్ మనోహర్, ప్రవీణ్, గంగ మల్లు, నరేష్, సోను, గంగా దాస్, అజయ్, సందీప్, గంగన్న, నర్సయ్య, మహేష్, దిలీప్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఇమ్మడిగోపి

కొంగరి బాబుది ప్రభుత్వ హత్యే

- జీపీ కార్మికుడి కుటుంబానికి 10 లక్షల ఎక్స్ గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గ్రామపంచాయతీ కార్మికుడు కొంగరిబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని, పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, వేతన పెంపు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, యూనియన్ జిల్లా నాయకులు మురళి, రమేష్ మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా బీబీపేట గ్రామపంచాయతీ కార్మికుడు కొంగరి బాబుకు నాలుగు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని నడపలేని పరిస్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. కొంగరి బాబు ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఇది ప్రభుత్వం చేసిన హత్యేనని అన్నారు. నాలుగు నెలలుగా అన్ని జిల్లాల్లో కార్మికులకు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ కుబేర్, ఎస్టీఓలో ఫ్రీజింగ్ పెట్టడం వల్ల సర్పంచ్, సెక్రెటరీలు చెక్కులు రాసినా ఎస్టిఓ ఆఫీస్ లోనే డబ్బులు మురుగుతున్నాయన్నారు. కార్మికులు అనారోగ్యాలతో చనిపోయినా నేటికీ ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కిషన్, విటల్, కార్మికులు ప్రవీణ్, రవి, లింబాద్రి, మహేష్, రమేష్, సుజాత, రాజారాం, సలీం రాజన్న, గంగారం, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యం చలివేంద్రం

- ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మంగళవారం చలి వేంద్రాన్ని సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్ ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బస్టాండుకు వచ్చే ప్రయాణికులకోసం గ్రామం తరపున చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ధారావత్ గోపాల్ నాయక్, దొనకంటి గంగామోహన్, లాల గౌడ్ శ్రీనివాస్, సబ్బని గంగాధర్, ప్రయాణికులు పాల్గొన్నారు,



చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్

ఘనంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్‌కట్‌చేసిన నాయకులు
- రోగులకు పండ్ల పంపిణీ
- మొక్కలు నాటిన నాయకులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-విలేకరులు

తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు ,గృహ నిర్మాణం, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి అనంతరం మొక్కలునాటి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

భీంగల్: పట్టణకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతసురెందర్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బాపూజీ నగర్ కాలనీలో 8 వార్డు కౌన్సిలర్ సతీష్‌గౌడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. మండలపరిషత్ కార్యాలయంలో యంపిడిఓ రాజేశ్వర్, ఏపిఓ నర్సయ్య, సిబ్బంది కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నర్సయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపిపి ఆర్మూర్ మహేష్ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రంలోని సముద్రతీరాన మంత్రి వేముల, కేసీఆర్ చిత్రాలతో సైకత శిల్పం రూపొందించి మంత్రి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటీసిలు సాయిప్రసన్న, సుర్జీల్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మండలంలోని గోన్‌గొప్పుల గ్రామంలో శ్రీరాముల భూమేశ్వర్ ఆధ్వర్యంలో హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేయించారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మంత్రి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని కొనసముందర్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి పుట్టినరోజు వేడుకల్లో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగారెడ్డి పాల్గొన్నారు. కోనసముందర్ గ్రామ మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన వేడుకల్లో గంగారెడ్డి కేక్ కట్ చేశారు.

చౌట్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షురాలు లోలపు గౌతమి, మండల పార్టీ అధ్యక్షులు రేగుంట దేవేందర్ కేక్ కట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేసి, మొక్కలు నాటారు. బషీరాబాద్‌లో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తన పుట్టిన రోజు సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుని ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ముప్కాల్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి" ఆలయంలో కార్యకర్తలు నడుమ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్ ఆధ్వర్యంలో మంత్రి పుట్టినరోజు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమలు చేపట్టారు. కేక్ కట్ చేశారు. ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతోపాటు మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేష్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు మునిరొద్దీన్, కమ్మరి రాజు తదితరులున్నారు. మండలంలోని నల్లూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యకమంలో జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, తదితరులు పాల్గొన్నారు..



కమ్మర్‌పల్లి:ప్రశాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం

ధర్పల్లి : రాష్ట్ర రాజధాని లోని మంత్రి నివాసంలో శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మెండోర: మండలంలోని సావెల్ గ్రామంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు గుండేటి.సతీష్ పాఠశాల విద్యార్థుల కు పరీక్ష అట్టలు , పెన్నులు , పెన్సిల్స్ వితరణ చేశారు. అనంతరం విద్యార్థుల కు పండ్లు పంపిణీ చేశారు.

జక్రాన్‌పల్లి: మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి దంపతులు కలిసి పుష్పగుచ్ఛమిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మోర్తాడ్: పార్టీ కార్యాలయం వద్ద నాయకులు భారీ కేక్ కట్ చేసి మంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం వేల్పూర్ మండలంలోని పడిగల్‌వద్ద ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో సర్పంచ్ ధరణి రక్తదానం చేశారు.

ఆర్మూర్ : పట్టణ బార్ అసోసియేషన్, న్యాయవాదులు, అడిషనల్ పీపీ ఆవారి రమేష్ ఆధ్వర్యంలో కట్ చేశారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి లో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కష్ణంరాజు, శంకర్, మురళీధర్, ఏర్గట్ల గణేష్, ప్రవీణ్ చందర్, శ్రీనివాస్ విజయలక్ష్మి ,గంగారం బుట్టి మధు ,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




ఏర్గట్ల : మంత్రి జన్మదినం సందర్భంగా కేక్‌కట్‌చేస్తున్న నాయకులు

మంత్రి స్వగ్రామమైన వేల్పూర్ మండల కేంద్రంలో వేల్పూర్ క్రాస్ రోడ్ మార్కెట్ యార్డు వద్ద రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బాల్కొండ నియోజక వర్గంలోని పలువురు నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎడ్ల రాజేశ్వర్ రెడ్డి, తీగల రాధా మోహన్, జై డి నాగాధర్ రెడ్డి, ఆరే నితీష్ కుమార్, సర్పంచులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.

పెర్కిట్ ప్రభుత్వ బాలుర వసతి గహంలో.

పెర్కిట్ ప్రభుత్వ బాలుర సమీకృత హాస్టల్లో ప్రశాంత్ అన్న యువసేన నాయకులు, బీసీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.



ఆర్మూర్ : రక్తదానం చేస్తున్న వేల్పూర్ నాయకులు



ముప్కాల్‌లో..



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్ : కేక్‌కట్‌చేస్తున్న న్యాయవాదులు

ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆకస్మిక పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కొందూరు శ్రీ నరసింహ స్వామి దేవాలయంలో టీఎన్జీఎస్ పక్షాన మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగుల సమస్యలు మరియు జిల్లా ఉద్యోగుల వివిధ సమస్యలపై కూలంకషంగా చర్చించారు. సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్జీవో సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్, పోల శ్రీనివాస్, ఉమా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌కొండూర్‌లో ఎమ్మెల్సీ కవిత పూజలు

నవతెలంగాణ-నందిపేట్



మండలంలోని సిహెచ్ కొండూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్సీ కవిత మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తన జన్మదినం కావడంతో తమ ఇంటి దైవమైన నరసింహ స్వామిని తన భర్తతోపాటు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలిత, జడ్పిటీసీ ఎర్రం యమున ముత్యం, కొండూరు సర్పంచ్ ప్రభాకర్ రావు, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షులు మచ్చర్ల సాగర్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హానుమాండ్లు, దారం సురేష్, సర్పంచ్‌లు, కార్యకర్తలు ఉన్నారు.

వేంపల్లి పాఠశాలలో స్వయం పాలన

నవతెలంగాణ-ముప్కాల్

ప్రాథమిక పాఠశాల వేంపల్లిలో మంగళవారం'స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థుల్లో ఒకరు ప్రధానోపాధ్యాయులుగా మిగితా తరగతులనుంచి ఒక్కొక్కరు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. విద్యార్థులకు స్వయం పరిపాలనలో భాగంగా ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యాలు, క్రమశిక్షణ, సమయపాలన తదితర అంశాలపై మెళుకువలు నేర్పించారని ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాధ్యంకాని వాగ్దానాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం

- మాజీమంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

రాష్ట్ర ప్రభుత్వం సాధ్యం గాని వాగ్దానాలు చేసి పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 9సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కలలు నెరవేరుస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏ ఒక్క హామీనికి నెరవేర్చలేదన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 23,470 దరఖాస్తులు రాగా 5750 మందిని లబ్దిదారులుగా తీసుకొని 9 సంవత్సరాలలో 1715 ఇండ్లు అసంపూర్తిగా నిర్మించి కామారెడ్డి పట్టణంలో 470 ఇండ్లకే లక్కీ డ్రా తీశారని తెలిపారు.

కేటీఆర్ సభకు కార్యకర్తలు తరలిరావాలి

- ఎంపీపీ ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పిట్లంలో జరగబోయే కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ప్రతాపరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి చేతుల మీదుగా రూ.25 వేల కోట్లతో నిజాంసాగర్ మండలంలోని నిర్మించిన పెద్ద పూలు వంతెన ప్రారంభోత్సవం అనంతరం నిజాంసాగర్ మండలంలోని కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన అతిథి గృహాన్ని ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం 476 కోట్లతో నిర్మిస్తున్న నాగమడుగు ప్రాజెక్ట్ మత్తడి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం పిట్లంలోని భారీ బహిరంగ సభలో పాల్గొంటారని కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

కంటివెలుగుతో దృష్టిలోపం దూరం

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- పలు గ్రామాల్లో కంటివెలుగు ప్రారంభం
- పరిశీలించిన పలువురు అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని, అవసరం ఉన్న వారికి కంటి శస్త్రచికిత్సలు చేసి అద్దాలు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగును త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కంటి వెలుగులో భాగంగా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కంటి వెలుగు పరీక్షల తీరును పరిశీలించారు.



దోమకొండ : కంటివెలుగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, సిబ్బంది ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్ : మండలంలోని కుప్రియల్ గ్రామంలో కంటి శిబిరాన్ని మంగళవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గైని అనుసూయ మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, జడ్పీటీసీ కమిలి నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వడ్ల రాజేందర్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం సందర్శన

ఎడపల్లి : మండలంలోని అంబం (వై)లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. వైద్యులు అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. దగ్గర, దూరం చూపుతో బాధపడుతున్న వారికి కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు గంగామణి, నర్సవ్వ, ఆశావర్కర్లు, స్వరూప, బిల్ కలెక్టర్ లక్ష్మణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం

రెంజల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ వికార్ పాషా, ఎంపీటీసీ ఎస్కే అహమ్మద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కంటి సమస్యలతో బాధపడకుండా నిరుపేదలకు కంటి అద్దాలను అందజేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. గ్రామంలోని 18 సంవత్సరాల పైబడిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కె.సాయిలు, చంద్రశేఖర్, గుర్రాల సంతోష్, హెచ్ఈఓ కరిపే రవీందర్, ఆరోగ్య సూపర్‌వైజర్ మాలంబి, పీహెచ్ఎన్ రాణి, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, జమున, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, ఇర్ఫాన్, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గామా 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బోధన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచందర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఈ నెల 16న దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆ ప్రవేశ పరీక్షకై దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక పరీక్షలో ప్రతిభ ఆధారంగా వివిధ గురుకుల విద్యాసంస్థల రిజర్వేషన్ ఆధారంగా ప్రరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత భోజనం, వసతి సదుపాయాలు, నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం, కాస్మోటిక్ చార్జీలు, వివిధ సహపాఠ్యా కార్యక్రమాలలో ప్రత్యేక శిక్షణ కల్పిస్తుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మార్చి 16వ తేదీ వరకు ప్రవేశపరీక్షకై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటు పనులు త్వరగా పూర్తి చేయించాలని కోరుతూ దోమకొండ మండలాధ్యక్షులు మధుసూదన్‌రావు, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి ఆక్సిజన్ ప్లాంటును గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు చేయించారని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆక్సిజన్ ప్లాంట్ పనులు మొక్కుబడిగా సాగుతున్నాయని పనులు త్వరగా పూర్తిచేసేటట్టు కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, నాయకులు ప్రభుత్వ గంప గోవర్ధన్ కోరారు. ఆక్సిజన్ ప్లాంట్ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలుపగా, ఆక్సిజన్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేయిస్తానని విప్ గంపగోవర్ధన్ హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మధుసూదన్ రావు, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నరసయ్య, కోఆప్షన్ సభ్యులు శమ్మి, కానుగంటి నాగరాజు, దరిపల్లి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్



శశాంక్ పాటిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల నూతన బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్‌కు, మండలంలోని లింబూర్ సర్పంచ్ మధుకర్ పటేల్‌కు డోంగ్లి బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు గాయక్వాడ్ విలాస్ మంగళవారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన డోంగ్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్ మండల అభివృద్ధికి గానీ పార్టీ బలోపేతానికి గాని ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. లింబూర్ సర్పంచ్ మధుకర్ పటేల్ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ప్రజా సమస్యల పట్ల మరింతగా కృషి చేయాలని కోరారు. శాలువాతో ఘనంగా సత్కరించినందుకు మండలాధ్యక్షులు లింబూరు సర్పంచ్ విలాస్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నవతెలంగాణ-రెంజల్



రేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మండల కేంద్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సయ్యద్ అశ్ఫక్ హైమద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రేషన్ దుకాణంలోని రేషన్ కోటతో పాటు మిగిలి ఉన్న సరుకులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు.

కరాటే ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది

- ఎస్ఐ ఆనంద్ సాగర్



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-కోటగిరి

కరాటే ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఎస్ఐ ఆనంద్ సాగర్ అన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 12న ఎస్.నైన్ క్లాసిక్ ఇండియా ఫిట్‌నెస్ ఎక్స్పో 2023 రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీ వివేకానంద హైస్కూల్ కోటగిరి చిన్నారులు తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్9 క్లాసిక్ ఇండియా ఫిట్‌నెస్ ఎక్స్పో 2023 పోటీలలో పాల్గొని మెడల్స్ అందుకున్న విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ విద్యాసాగర్ విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో పి.అనుష్ రెండో తరగతి విద్యార్థికి గోల్డ్ మెడల్, యశస్చంద్ర మూడో తరగతి విద్యార్థికి వెండి పతకం, శాన్వి మూడో తరగతి విద్యార్థినికి కాంస్య పతకం, ప్రేరణ 4వ తరగతి విద్యార్థినికి కాంస్య పతకం, వినోద్ ఏడో తరగతి విద్యార్థికి కాంస్య పతకం, ప్రణయ్ 8వ తరగతి విద్యార్థికి కాంస్య పతకం, సాయి శ్రీకర్ 8వ తరగతి విద్యార్థికి వెండి పతకం, సాయి చరణ్‌రెడ్డి 9వ తరగతి విద్యార్థికి కాంస్య పతకం, రాహుల్ 9వ తరగతి విద్యార్థికి కాంస్య పతకం, విష్ణు 9వ తరగతి విద్యార్థికి వెండి పతకం, సృజన్ నాలుగో తరగతి విద్యార్థికి కాంస్య పతకం, హర్షవర్ధన్ మూడో తరగతి విద్యార్థికి కాంస్య పతకం లభించడంతో పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల యాజమాన్యం, కరాటే మాస్టర్ ఎస్కే ఖయ్యూం, కరాటే పల్లవి పాల్గొన్నారు.

టీబీ రోగులకు.. పౌష్టికాహారం ముఖ్యం

- సూచించిన వైద్యులు
- పలుచోట్ల క్షయ వ్యాధిపై అవగాహన



మద్నూర్ : అవగాహన కల్పిస్తున్న అధికారులు



రాజంపేట్‌లో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

టీబీ రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. మంగళవారం పలు ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ వచ్చినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

మద్నూర్ : మండలంలోని కొడిచెర గ్రామంలో ఆరోగ్య సబ్ సెంటర్‌లో క్షయ వ్యాధిపై గ్రామస్తులకు డాక్టర్ శివలీల అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి రెండు రకాలుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ రాజమణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, నరసమ్మ అంజనాభాయి, ఆశావర్కర్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సూపర్‌వైజర్ గంగామని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాల టీబీ చరిత్ర కలిగిన వారిని, గతంలో కోవిడ్ వచ్చిన వారిని, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిని, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని టీబీ లక్షణాల గురించి వారికి సింటమ్స్ ఎగ్జామినేషన్ చేయించాలని అవగాహన కల్పించారు. అలాగే టీబీ మందులు వాడుతున్న వారికి అందుతున్న బెనిఫిట్స్ గురించి వివరించారు. అలాగే టీబీ ఛాంపియన్‌తో కూడా అవగాహన ఏర్పటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్యామ్ కుమార్, ఐకేపీ మెంబర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ ఫరీదా ఏఎన్ఎం చందబిబి, నాగలక్ష్మి, ఆశావర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్, ఎత్తొండ గ్రామంలో టీబీపై అవగాహన కార్యక్రమం, ర్యాలీలను ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ప్రజలకు టీబీ వలన వచ్చే నష్టాలను వివరించారు. టీబీ వచ్చినవాళ్లు పౌష్టికాహారం తీసుకోవాలని, తెమడ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, సూపర్‌వైజర్లు కృష్ణవేణి, జ్యోతి పాల్గొన్నారు.

కంఠాలీలో స్వయం పాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కంఠాలీ గ్రామంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో విద్యనందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధప్ప రాజయోగి గురుపూజోత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో సిద్ధప్ప రాజయోగి గురుపూజోత్సవాలను ఆయన కుమారుడు అనంతవరం వీరేశలింగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సరస్వతీ పూజ నిర్వహించి సిద్ధప్ప రాజయోగి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయపల్లి గ్రామంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి చేతులమీదుగా పశువైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించినట్టు పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు పశు పెంపకం దారులకు అవసరమయ్యే మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాశి నారాయణ, వైస్ చైర్మన్ సిద్ధిరామరెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఫతియోద్దీన్, లింగంపేట పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమేష్, గోపాలమిత్ర ఎజాజ్, రమేష్, మల్లేష్, కిషన్, ఓఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రెండు పూటలా సరఫరా చేయాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

నవతెలంగాణ-పిట్లం

వేసవి కాలం దృష్ట్యా తాగునీటిని ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవళికను సభ్యులు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత విజయ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవళిక శాఖపరమైన అభివృద్ధిపై మాట్లాడుతుండగా స్పందించిన సభ్యులు వేసవి కాలం అయినందున ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రెండు పూటలా తాగునీటిని అందించాలని కోరారు. బాన్సువాడ నుంచి పిట్లంకు సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు పిట్లం మండల కేంద్రానికి ఒక్క బస్సు కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆర్టీసీ ఇన్చార్జి కంట్రోలర్ యాదుల్ సూచించారు. గతంలో పిట్లం, కారేగావ్ మీదుగా గోధుమేగావ్ నైట్‌హాల్ట్ బస్సు వచ్చేదని.. కరోనా దృష్ట్యా బంద్ అయినా బస్సును పునరుద్ధరించాలని కరేగాం సర్పంచ్ దుర్గయ్య కోరారు. బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారం, కిడ్నాప్‌లు జరగకుండా చూడాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి స్వర్ణలత సభను కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వాసరి సావిత్రి తొలిసారి సర్వసభ్య సమావేశానికి హాజరైన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, ఎంపీఓ బ్రహ్మం, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

అంగన్వాడీ కేంద్రంలో రికార్డుల పరిశీలన

నవతెలంగాణ-రెంజల్



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

మండలంలోని సాటాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి మంగళవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన ఆమె పరిసరాల పరిశుభ్రత, వంటగదిని శుభ్రపరచడం, చిన్నారు లకు పౌష్టికాహారాన్ని అందించడం తదితర అంశాలపై అంగన్వాడీ టీచర్‌ను ఆదేశించారు. న్యూట్రి గార్డెన్‌ను శుభ్రం చేసి తిరిగి కూరగాయ సాగును ప్రారంభించాలని ఆమె సూచించారు. గర్భవతులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, టోల్ ఫ్రీ నెంబర్లను తప్పకుండా గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రసవ సమయంలో 108 వాహనాన్ని ఉపయోగించుకొని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని ఆమె సూచించారు. అనంతరం కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించిన ఆమె వృద్ధులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట పీహెచ్ఎస్ రాణి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్/రెంజల్

మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించినట్టు సర్పంచ్ పద్మ గంగారెడ్డి తెలిపారు. శెట్పల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశానుసారం ఎన్ఆర్ఈజీఎస్ రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మాగంగారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శ్రీనివాస్, వార్డు మెంబర్లు శివ రాములు, అప్ప సాయిలు, అట్టెం మల్లయ్య, లక్ష్మాగౌడ్, అశోక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మన్నె బాలయ్య, బీఆర్ఎస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : శెట్పల్లిలో పనులు ప్రారంభం

రెంజల్ : మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ వెలమల సునీత నరసయ్య, ఎంపీటీసీ చింతకుంట లక్ష్మీ ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే షకీల్ అమీర్ సహాయ సహకారాలతో ఈ పనులు మంజూరయ్యాయని ఈ సందర్భంగా ఆయనకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి రైతు సమన్వయ కమిటీ జిల్లా నాయకులు ఎండీ మౌలానా, స్థానిక నాయకులు లింగాల అబ్బన్న, మల్ల సాయిలు, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-బోధన్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదని, వాటిని ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మహిళలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ భాషలో ఇదేవిధంగా మాట్లాడతారని, మోసపోయే మాటలు చెబుతూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారన్నారు. బండి సంజయ్‌కి సంస్కారం లేదని విమర్శించారు. అదే పార్టీ.. తోటి ఎంపీ అయిన అరవింద్ కూడా బండి సంజయ్ మాటలను సమర్థించడం లేదన్నారు. కనుక బండి సంజయ్ ఇప్పటికైనా నీ పదజాలాన్ని మార్చుకోవాలని పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోవాలని లేకపోతే, ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్, షేక్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంజర భూమయ్య

డిజిటల్ స్టడీ మెటీరియల్ ప్రతులను ఆవిష్కరించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పదవ తరగతి విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో తయారు చేయించిన డిజిటల్ స్టడీ మెటీరియల్ ప్రతులను రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా బాల్కొండ నియోజకవర్గంలోని సుమారు 2000 మంది పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల కోసం డిజిటల్ స్టడీ మెటీరియల్‌ని తయారు చేయించారు. దీని బార్ కోడ్ ని త్వరలోనే అందజేస్తామన్నారు. దీనిద్వారా విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన తిగుర్ల లింబాద్రి(52) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. 10వ తేదీనా ఉప్లూర్ శివారులో గల తమ వ్యవసాయ భూమి వద్ద పని ముగించుకొని తన బైక్ పై ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యలో ఉప్లూర్ శివారులో వడ్డెర కాలనీ, ఎరుకల కాలనీ మధ్యకు రాగానే ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయం అయ్యింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తునట్లు ఎస్ఐ తెలిపారు.

ముదిరిన ఎండలు..
తగ్గిన జనసంచారం

- మార్కెట్లో జోరుగా పుచ్చకాయ, కొబ్బరి బండ్ల విక్రయాలు

నవతెలంగాణ-బోధన్



ఎండకు నిర్మానుష్యంగా మారిన ప్రాంతం

ఎండాకాలం కంటే ముందే ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 భానుడు ప్రతాపం చూపెడుతుండటంతో పట్టణాల్లో జన సంచారం తగ్గుతోంది. ఎండ తాకిడికి జనం బయటకు రాలేకపోతున్నారు. మంగళవారం ఎండల వేడిమికి బోధన్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా అయిన అంబేద్కర్ చౌరస్తా జన సంచారం తగ్గిపోయి వెలవెలబోయింది.

మార్కెట్లో జోరుగా పుచ్చకాయ విక్రయం..

ఎండాకాలం ఎండలు ప్రారంభం కావడంతో మార్కెట్లో ఎండల నుంచి ఉపశనమిచ్చే పుచ్చకాయలు, కీరదోస, కొబ్బరిబోండాలు, చెరుకురసం, తర్బూజ, జ్యూస్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. కొబ్బరిబోండాలు 40-50/-లు, పుచ్చకాయలు 30/- కిలో చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే జ్యూస్ సెంటర్లు ప్రతిచోట వెలిశాయి. దాంతో జనం వాటిని సేవించి ఉపశమనం పొందుతున్నారు. సాలూర మంజీర నదిలో మహారాష్ట్ర వాసులు పుచ్చకాయలు పండించి విక్రయిస్తున్నారు.

రేవంత్‌రెడ్డికి అభివృద్ధి కనిపించడంలేదా?

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్
- మంత్రి ప్రశాంత్ రెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న రేగుంట దేవేందర్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి, ఆ పార్టీ నాయకులకు బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రేగుంట దేవేందర్ ప్రశ్నించారు. మండలంలోనిచౌట్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కొత్తపల్లి రఘుతో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి ప్రశాంత్ రెడ్డిని విమర్శించే అర్హత, స్థాయి రేవంత్ రెడ్డికి, మానాల మోహన్ రెడ్డికి లేదన్నారు. గ్రామ గ్రామన సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ కనిపించడం లేదా అని అన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపాలని మంత్రి అధికారులను ఆదేశించిన విషయం తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అమరుల స్తూపం, సచివాలయం, అంబేద్కర్ విగ్రహాల నిర్మాణాల్లో అవినీతి అంటూ ఆరోపణలు చేస్తూ మంత్రి ప్రశాంత్ రెడ్డిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకొవాలని వారు హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, సర్పంచులు గడ్డం స్వామి, మారు శంకర్, దయ్య దేవయ్య పుప్పల గంగాధర్, పెండే ప్రభాకర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, ఎంపీటీసీ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సూపరింటెండెంట్ రిజ్వానా సమీర్ తెలిపారు. సకాలంలో విద్యార్థులు పరీక్ష హాలుకు చేరుకోవాలని మొదటి సంవత్సరం విద్యార్థులు 237 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 184 మంది హాజరుకానున్నట్టు తెలిపారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉన్నట్టు తెలిపారు.

దోమతెరలు పంపిణీ



కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధులు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో పాటు ఆయన ఆధ్వర్యంలో దోమతెరల పంపిణీని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ 3వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఫయాజుద్దీన్, లొల్లి పర్వయ్య, నాగునూరు రాజశేఖర్, (న్యాయవాది) కాజా ఖలీల్ ఉల్లా, పిట్ల అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ శిరీష మంగళవారం సందర్శించారు. ఆస్పత్రికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనితోపాటు మహిళా ఆరోగ్య రక్ష గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డోంగ్లి ఆరోగ్య కేంద్ర వైద్యురాలు వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మృతదేహం

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. ఈనెల 12న సాయంత్రం మండలంలోని పడకల్ గ్రామ శివారులో పడకల్ గ్రామం నుంచి రుప్లా నాయక్ తండాకు వెళ్తున్న ఒకరు మోపాల్ మండలం నుంచి తానాకుర్దు గ్రామానికి చెందిన ఐటి గంగా జలంధర్ పరకాల గ్రామానికి వస్తున్నాడు. ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనగా ఐటి గంగా జలంధరకు, ఆయనతోపాటు ఉన్న మచ్చ సత్యంకు గాయాలయ్యాయి. వీరి ఇరువురిని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసినా పరిస్థితి విషమించి ఐటి గంగా జలంధర్(33) మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మచ్చ సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీస్ స్టేషన్ గోడకు ఢీకొన్న కారు..

నవతెలంగాణ-నవీపేట్



గోడను ఢీకొన్న కారు

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ గోడకు మంగళవారం సాయంత్రం షిఫ్ట్ కారు ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ వైపు నుండి వస్తున్న కారు అదుపుతప్పి పోలీస్ స్టేషన్ గోడకు ఢీ కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రాజారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్షయ వ్యాధి నిర్మూలకు విద్యార్థులతో ర్యాలీ



క్షయ చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని పచ్చల నడుకుడ గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్షయ వ్యాధిని నిరోధించుటకు సామాజిక చైతన్య ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధులలో విద్యార్థులు తిరుగుతూ ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ ఆరోగ్య కార్యకర్త శోభ, ఆశా కార్యకర్తలు సవిత, కవిత పాఠశాల ఉపాధ్యాయులు దేవానంద్, గణేష్, గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ



పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. సర్పంచ్ దయ్య దేవయ్య తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్ష ఆటలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవయ్య మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి ఉత్తమ గ్రేడ్లు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో పైకి ఎదగాలన్న. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్న పదవ తరగతి ఎంతో కీలకమైందని అన్నారు. చదువు పట్ల అశ్రద్ధ చేయకుండా కష్టపడి చదివి మంచిగా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టేకుల జలంధర్, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పాలెపు విజయ్, రాజేందర్, అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్

నవతెలంగాణ-రామారెడ్డి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెరిగిన ధరలు తగ్గించాలని, గ్యాస్, పెట్రోల్ ధరను తగ్గించాలని, ధరణిలో తప్పుపడ్డ పాస్ పుస్తకాలను సరిచేయాలని, మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఇండ్ల స్థలాలు కేటాయించకపోవడం అధికార పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.కె కాసీం, శ్యామల, మనమ్మ, లక్ష్మణ్, మహేష్, భారతి, పోషవ్వ, రాజమణి, లక్ష్మి, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేకుండానే సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

మండలకేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో సమావేశం సాదాసీదాగా జరిగింది. రెవిన్యూ శాఖ వారు మాట్లాడుతూ... రేషన్ కార్డులో పేర్లు లేని వారివి చేర్చేందుకు ఇంకా అప్షన్ రాలేదని తెలిపారు. గుమ్మిర్యాల్ సర్పంచ్ సోమా రాజారెడ్డి మాట్లాడుతూ... లిఫ్ట్ పాత కమిటీ సమయం అయిపోయిందని, లిఫ్ట్ బాధ్యత చూసేవారు కరువైయ్యారని తెలిపారు. ఐదురోజుల నుండి పంటకు నీరు లేదని, మరోరెండు రోజులు అయితే పంటలు ఎండి రైతులు దిగుబడి కోల్పోతారని అన్నారు. నిర్మల్ దారిలో వర్షానికి రోడ్డు కోతకు గురైందని పలుమార్లు ఆ శాఖ వారికి విన్నవించుకున్నామని ప్రమాదాలు కూడా జరిగాయని, అక్కడ రాళ్ల అడ్డంగా పెట్టామని అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖవారు మాట్లాడుతూ... ఇప్పటివరకు కంటి వెలుగులో భాగంగా 4036 మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. పి.హెచ్.సీలో పాము కాటుకు విరుగుడు మందు ఉందా.. అని అడిగితే మందును నిర్వహించే సదుపాయాలు లేనందున వైద్యం అందడం లేదన్నారు.ఆర్ అండ్ బి అధికారి మాట్లాడుతూ...ఏర్గట్ల నుండి వర్షకొండ వెళ్ళే తీగల వాగుకు బ్రిడ్జి నిర్మాణానికి 2 కోట్ల రూపాయల మంజూరు చేయబడిందన్నారు.

మండలంలో సీసీ రోడ్లు పోసిన ఆరునెలలకే కంకర తేలాయని పంచాయతీ రాజ్ ఏఈని అడిగితే సీసీ పోసిన 15 రోజులకు బిల్ చేసి పోతా నాకేం తెలుసు అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. హార్టికల్చర్ ఆఫీసర్ మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగులో ఏర్గట్ల మండలం నాలుగో స్థానంలో ఉందని తెలిపారు.

అలాగే పండ్ల తోటల పెంపకంలో కూడా ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుందని గుర్తుచేశారు. హాస్టల్ వార్డెన్ రాము మాట్లాడుతూ... విదేశాలలో పీజీ చేసే వారికి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ తరపున ఎస్సి విద్యార్థులకు ప్రభుత్వం 20 లక్షల ప్రోత్సాహకంగా స్కాలర్ షిప్ మంజూరు చేస్తుందని అన్నారు. ఒకటి నుండి ఐదో తరగతి ఎస్సి విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ద్వారా లాటరీ పద్ధతిలో కార్పొరేట్ స్కూళ్లలో జూన్‌లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేశం,ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి ఎంపీటీసీలు జక్కని మధుసూదన్, బొల్లి శంకర్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, కుండ నవీన్, సోమ రాజారెడ్డి, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివినప్పడే రాణిస్తారు



డ్యాన్సులతో అలరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ధర్పల్లి

విద్యార్థులు భయం వీడి చదువుపై మక్కువ పెంచుకుని ఇష్టాంగా చదివినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని మండల కేంద్రములోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెర్వెల్ పార్టీలో అయన మాట్లాడుతు ప్రతి విద్యార్థికి పాఠశాల జీవితం అనేది రాబోయే భవిశ్యత్తుకు పునాది లాంటిదని అన్నారు. శ్రద్ధగా చదివి తల్లి తండ్రుల పేరు తోపాటు గ్రామానికి మంచి పేరు తీసుక రావాలని రోరారు,కార్యక్రమములో విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యకాలు ఆకట్టుకున్నాయి, కార్యక్రమములో ఉపాధ్యాయులు హిమాయత్ అలీ, విజయ, కరుణశ్రీ, కళ్యాణి, వెంకటేశ్వర్లు, మునిరోద్దిన్, రామానుజాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆరోగ్య మేళా



నిజామాబాద్‌రూరల్ : మందులను అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్/ఆర్మూర్

మండలంలోని న్యాల్కల్ ఉపకేంద్రంలో ఆరోగ్య మేళాను సర్పంచ్ గంగప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధి పట్ల భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ఈ లక్షణాలతో బాధ పడుతున్న వాళ్ళందరూ తెమడ నమూనాలు ఇచ్చి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. మందులు ఉచితంగా లభిస్తాయని, ట్రీట్మెంట్ ఇస్తున్నరోజుల్లో 500చొప్పున ప్రతీ నెల పేషెంట్ అకౌంట్‌లోకి వస్తాయని తెలిపారు. ఈ మేళా ప్రతీ నెల 14న జరుగుతుందని ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని అన్నారు. టీబీ పేషెంట్స్ కు మందుల పంపిణీ కూడా చేశారు. టీబీ జిల్లా కో ఆర్డినేటర్ రవిగౌడ్, పంచాయతీ సెక్రటరీ మల్లేష్, ఎంపిహెచ్ఏ సురేష్, శోభ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య మేళా..

ఆర్మూర్ : పట్టణంలోని మామిడిపల్లి సరస్వతి నగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్యమేళ నిర్వహించారు. దీంతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడిపల్లికి చెందిన సాయన్న అంగన్వాడి కేంద్రానికి చిరు సహాయం అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుగుణ, శ్యామల, ఆశా వర్కర్, అంగన్వాడి టీచర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. హాత్ సే హాత్ పాదయాత్రలో భాగంగా మంత్రి ప్రశాంత్ రెడ్డిని రేవంత్ రెడ్డి విమర్శించడాన్ని తప్పుపడుతూ.. బీఆర్ఎస్ నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ఓటుకు నోటులో అడ్డంగా దొరికిన దొంగవు నీవా.. 500 కోట్లు పెట్టి పీసీసి పదవి తెచ్చుకుని కల్లబొల్లి మాటలు చెప్తే ప్రజలు నమ్ముతారనుకుంటున్నవా.. అని అన్నారు. గంజాయికి ప్రశాంత్‌రెడ్డికి ఏమిటి సంబంధం.. మతి ఉండి మాట్లాడుతున్నవా.. అని విమర్శించారు. ఇండ్లకు పెయింట్ వేసుకుని బతికిన నీకు ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇదంతా అక్రమ సంపాదన కాదా..? మాటికి మంత్రి తమ్ముడు అజయ్ రెడ్డిని, వారి కుటుంబాన్ని బద్నాం చేయడం మానుకోక పోతే ప్రజలే తగిన బుద్ది చెపుతారని అన్నారు. ఇకనైనా దివాలకోరు రాజకీయాలు మానుకో అని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,ఎంపీటీసీ జక్కని మధు సూధన్,కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య,పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, కుండ నవీన్, బీఆర్ఎస్ నాయకులు నెరేళ్ళ లింగారెడ్డి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బద్దం ప్రభాకర్, తాహెర్, కొలిప్యాక శ్రీనివాస్, ఓర్సు రాములు, రోక్కెడ మోహన్, జైనోద్దీన్, మురళి రాంపెల్లి, ఇబ్రహీంపట్నం నరేష్, జోగు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్దియా డ్రైవర్‌పై ఫ్రూట్‌షాప్ నిర్వాహకుల దాడి

- కాంప్రమైజ్ చేసేందుకు ఎంఐఎం లీడర్ల యత్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ డ్రైవర్‌పై ఫ్రూట్ షాప్ నిర్వాహకులు దాడి చేయగా ఎంఐఎం లీడర్లు కేసును కాంప్రమైజ్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలో మాలపల్లి హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్లో బల్దియా కార్మికులపై దాడి జరిగింది. మంగళవారం ఉదయం హోల్సేల్ మార్కెట్‌లోని చెత్తను తరలించేందుకు వచ్చిన టిప్పర్ నిండిపోవడంతో వెళ్తుండగా టిప్పర్ డ్రైవర్ జస్వీర్ సింగ్‌పై ఆంధ్ర ఫ్రూట్ హోల్‌సేల్ యజమాని అబ్దుల్ ఆహాద్ ఆయన తనయుడు, వర్కర్లు కలిసి దాడి చేశారు. విషయం తెలిసిన బల్దియా కార్మికులు అక్కడికి చేరుకొని ధర్నా నిర్వహించారు. దాంతో రంగ ప్రవేశం చేసిన ఎంఐఎం లీడర్లు కేసు కాంప్రమైజ్ చేసేందుకు యత్నించారు. బాధితుడు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్మికుడి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కార్మికులు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ధర్పల్లి

నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఇందుకు కావలసిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరిండెంట్ పి, సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 253 మంది, రెండో సంవత్సరం 287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఒక్క నిమిషము ఆలస్యమైనా అనుమతించబడదని తెలిపారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు, హిందీ పేపర్ -1 పరీక్షకు 250 మంది విద్యార్థులు హాజరు కాబోతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున కళాశాల పరిసరాల్లో ఇతరులు ఎవ్వరు ఉండొద్దని పేర్కొన్నారు.